క్లుప్తంగా

విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో షాపు దగ్ధం



వేలేరు : విద్యుదాఘాతంతో బైక్ మెకానిక్ షాపు పూర్తిగా కాలిపోయింది. ఈ సంఘటన మండలంలోని కన్నారం గ్రామంలో చోటుచేసుకుంది. బాధితుడు వేణుమాధవ్ తెలిపిన వివరాల ప్రకారం.. కన్నారం గ్రామానికి చెందిన పెనల వేణుమాధవ్ అదే గ్రామంలో బైక్ మెకానిక్ షాపు నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం ప్రమాదవశాత్తు షాపులో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ సంభవించగా వస్తువులు, పరికరాలు పూర్తిగా దగ్ధమయ్యాయి. సుమారు రూ.2లక్షల వరకు నష్టం వాటిల్లిందని బాధితుడు వాపోయాడు. ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని కోరాడు.

బల్మూరి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిక



కమలాపూర్ : మండలంలోని మర్రిపల్లిగూడేనికి చెందిన బండి రాజేశ్, పుప్పాల సతీష్ టీపీసీసీ ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ సమక్షంలో శుక్రవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ మండల మాజీ అధ్యక్షుడు చరణ్‌పటేల్, దేవాలయ డైరెక్టర్ నారాయణరెడ్డి, మాజీ సర్పంచ్ రవీందర్, నాయకులు తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

యాదవులకు ప్రాధాన్యం ఇవ్వాలి

ఐనవోలు : మల్లికార్జునస్వామి యాదవుల ఇలవేల్పు అని, నూతన కమిటీలో యాదవులకు ప్రాధాన్యం ఇవ్వకుండా అవమానించడం సరికాదని జీఎంపీఎస్ మండల కార్యదర్శి చిన్నరాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మెజారిటీ ఒగ్గు పూజారులు ఒంటిమామిడిపల్లి గ్రామానికి చెందినవారు ఉన్నారని, ప్రతీసారి ఆ గ్రామం నుంచి ప్రాతినిధ్యం ఉండేదని తెలిపారు. అయితే ఈసారి ప్రాతినిధ్యం కల్పించకపోవడంతో సోషల్ మీడియాలో స్థానిక ఎమ్మెల్యే తీరుపై కొందరు అసంతృప్తి వ్యక్తం చేయగా గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు రాజీనామాలకు సిద్ధమయ్యారు. నాయకుల బుజ్జగింపులతో వారు శాంతించినట్లు తెలుస్తోంది. స్థానికేతరుడికి చైర్మన్ పదవి ఇవ్వడం ఏంటని బీజేపీ, బీఆర్‌ఎస్ నాయకులు ప్రశ్నిస్తున్నారు.

చికెన్ సెంటర్లలో తనిఖీలు



ఎల్కతుర్తి : భీమదేవరపల్లి మండలం కొత్తకొండలోని చికెన్ సెంటర్లలో పంచాయతీ శాఖ అధికారులు శుక్రవారం తనిఖీలు చేపట్టారు. డీఎల్‌పీఓ గంగాభవాని, మండల ప్రత్యేక అధికారిణి అనసూయ తనిఖీలు నిర్వహించి అపరిశుభ్ర వాతావరణంలో చికెన్ విక్రయిస్తున్న గుల్జార్ చికెన్ సెంటర్ యజమానికి నోటీసులు జారీ చేయడంతో పాటు రూ.5వేలు జరిమానా విధించినట్లు తెలిపారు. ఈ తనిఖీల్లో ఎంపీఓ నాగరాజు, కార్యదర్శి వేణు, ఏఎన్‌ఎమ్, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

గంజాయి విక్రేత అరెస్ట్

శాయంపేట : మండలంలో నలుగురు వ్యక్తులు జూన్ 14వ తేదీన గంజాయితో పట్టుబడగా వారికి అమ్మిన వ్యక్తిని పట్టుకుని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ రంజిత్‌రావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండలానికి చెందిన నలుగురు వ్యక్తులు జూన్ 14వ తేదీన కిలో 100 గ్రాముల గంజాయితో పట్టుబడినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. కాగా వారికి గంజాయి విక్రయించిన మహారాష్ట్రకు చెందిన రాదండి వెంకటేష్ (కృష్ణ)ను శుక్రవారం పట్టుకుని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఆయన తెలిపారు.

మాజీ మంత్రి పరామర్శ



ఐనవోలు : మండలంలోని కొండపర్తి గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ పార్టీ మండల మాజీ ప్రధాన కార్యదర్శి బుర్ర రాంబాబు అనారోగ్యంతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు శుక్రవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. రాంబాబు మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

యూనిఫాం అందజేత

దామెర : మండలంలోని పులుకుర్తి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు శుక్రవారం స్కూల్ యూనిఫాంను అందించారు. హుజూరాబాద్‌కు చెందిన ఎన్‌ఆర్‌ఐ అనుమ రాథోడ్ తల్లి మంజులరాథోడ్ జ్ఞాపకార్థం 45 మంది విద్యార్థులకు యూనిఫాం అందించినట్లు దాత పేర్కొన్నారు. ప్రధానోపాధ్యాయుడు జుమ్మి, ఉపాధ్యాయులు సతీశ్, అశోక్, అరిందర్, రాధాకృష్ణ పాల్గొన్నారు.

జాడలేని బోనస్ డబ్బులు

- యాసంగిలో 50 వేల క్వింటాళ్ల సన్నధాన్యం సేకరణ
- మూడు నెలలు గడుస్తున్నా బ్యాంక్ ఖాతాల్లో జమకాని వైనం
- ఎదురుచూపుల్లో రైతులు



కొనుగోలు కేంద్రాల వద్ద ఆరబోసిన ధాన్యం (ఫైల్)

ఐనవోలు : రాష్ట్ర ప్రభుత్వం సన్నాలకు బోనస్ ప్రకటించడంతో రబీలో గతంలో ఎన్నడూ లేని విధంగా రైతులు సన్న రకం వరి సాగు చేశారు. దళారులకు కాకుండా ప్రభుత్వం తరుపున ఏర్పాటు చేసిన సొసైటీలు, మహిళా సంఘాల కొనుగోలు కేంద్రాల్లో విక్రయించారు. ధాన్యం విక్రయించి మూడు నెలలు గడుస్తున్నా రైతుల ఖాతాల్లో బోనస్ డబ్బులు జమకాకపోవడంతో ఎదురుచూపులు తప్పడం లేదని పలువురు రైతులు తెలిపారు. 2025 రబీ సీజన్లో నందనం ఎఫ్‌ఎస్‌సీఎస్ ద్వారా 6 సెంటర్ల నుంచి 1,618 మంది రైతుల నుంచి 37,993.2 క్వింటాళ్ల ధాన్యం సేకరించారు. అదే విధంగా దర్గా సొసైటీ ద్వారా కొండపర్తి, ముల్కలగూడెం గ్రామాల్లో, ఐకేపీ మహిళా సంఘాల ద్వారా వెంకటాపూర్, పెరుమాండ్లగూడెం, ఒంటిమామిడిపల్లి, కొండపర్తి గ్రామాల్లో సుమారు 600 మంది రైతుల నుంచి 15 వేల క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేసినట్లు అధికారులు వెల్లడించారు. సేకరించిన ధాన్యాన్ని సివిల్ సప్లై అధికారులు కేటాయించిన రైస్ మిల్లులకు తరలించారు. సాధారణ రకం ధాన్యానికి ఇచ్చిన ప్రకారం డబ్బులు రైతుల ఖాతాల్లో జమచేశారు. సన్నాలకు సంబంధించిన క్వింటాల్‌కు రూ.500 బోనస్ మాత్రం ఇంకా జమకాలేదని, ధాన్యం విక్రయించి మూడు నెలలు గడుస్తున్నా బోనస్ చెల్లించకపోవడంతో రైతులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. మండలంలో ఖరీఫ్ సీజన్‌లో సన్నాలు ఎక్కువగా సాగుచేస్తుండగా, యాసంగిలో దొడ్డు రకం ధాన్యాన్ని ఎక్కువ సాగుచేసేవారు. ప్రభుత్వం సన్నరకం ధాన్యానికి క్వింటాల్‌కు రూ.500 బోనస్ ప్రకటించడంతో రైతులు సన్నాల సాగుకు చూపినట్లు మండలంలోని పలువురు రైతులు వెల్లడిస్తున్నారు. సన్నాలు సాగు వల్ల దాదాపు ఎకరాకు 6 క్వింటాళ్ల మేర దిగుబడి తగ్గిందని వాపోతున్నారు. బోనస్ ఆశతో సన్నాలు సాగు చేసి పంట దిగుబడి రాకపోవడంతో కొంతమేర నష్టపోయినట్లు చెబుతున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి బోనస్ డబ్బులను బ్యాంక్ ఖాతాల్లో జమ చేయాలని కోరుతున్నారు.

రైతులను ఆదుకోవాలి



సన్న రకం ధాన్యానికి ప్రభుత్వం అందిస్తామన్న బోనస్ కోసం ఎదురు చూస్తున్నాం. కష్టనష్టాలను ఓర్చుకుని సన్నాలను సాగు చేశాను. యాసంగిలో సన్నాలు సాగు చేయడం సరికాదని అనిపిస్తోంది. మూడు ఎకరాలు సాగు చేస్తే 60 క్వింటాళ్లు మాత్రమే దిగుబడి వచ్చింది. ప్రభుత్వం వెంటనే రూ.500 బోనస్ డబ్బులు చెల్లించాలి.

– బుర్ర కుమార్, రైతు, రాంనగర్

బోనస్‌కు ఆశపడి నష్ట పోయాను



ప్రభుత్వం క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇస్తామంటే ఆశపడి యాసంగిలో సన్నాలు సాగుచేశాను. నాలుగు ఎకరాల్లో ప్రతి సంవత్సరం దొడ్డు ధాన్యం పండిస్తే 85–90 క్వింటాళ్లు దిగుబడి వచ్చేది. ఈ సీజన్‌లో సన్నాలు సాగుచేస్తే కేవలం 67 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. గతంలో కంటే పెట్టుబడి పెరిగింది. సుమారు 20 క్వింటాళ్ల దిగుబడి తగ్గింది.

– బొల్లం ప్రకాశ్, రైతు, కక్కిరాలపల్లి

స్వయంఉపాధితో మహిళల ఎదుగుదల

- డీడీఎం చంద్రశేఖర్



మాట్లాడుతున్న డీడీఎం చంద్రశేఖర్

కమలాపూర్ : మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు స్వయంఉపాధి ఎంతో దోహదపడుతుందని డీడీఎం (జిల్లా అభివృద్ధి మేనేజర్) చంద్రశేఖర్ అన్నారు. పిండి వంటలు, పచ్చళ్ల తయారీ ద్వారా ఆర్థికంగా నిలదొక్కుకోవచ్చని చెప్పారు. మండలంలోని ఉప్పల్‌లో మైక్రో ఎంటర్‌ప్రైజెస్, నాబార్డ్ సహకారంతో ఇందిరా మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న తెలంగాణ పిండి వంటలు, పచ్చళ్ల తయారీ శిక్షణా శిబిరాన్ని శుక్రవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. మహిళలందరూ పిండి వంటలు, పచ్చళ్ల తయారీ శిక్షణను వినియోగించుకోవాలని అన్నారు. ఒక యూనిట్‌గా ఏర్పడి తెలంగాణ పిండి వంటలు లేబుల్ బ్రాండింగ్ కమ్ ప్యాకింగ్ చేసి నాణ్యతతో అందిస్తే మంచి మార్కెటింగ్ ఉంటుందన్నారు. ఉప్పల్ నుంచి గ్రామ్‌మార్ట్ ప్రారంభించే ప్రయత్నం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ గుండె బాబు, డీపీఎం రాజేంద్ర ప్రసాద్, బ్యాంక్ మేనేజర్ డేవిడ్, ఏపీఎం లలితాదేవి, సీసీ కుమారస్వామి, మండల సమాఖ్య అధ్యక్షురాలు సుజాత, శిక్షణ కార్యకర్త మమత, బీఓఏలు, మహిళలు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ గేమ్స్, మత్తుకు దూరంగా ఉండాలి

- డాక్టర్ సిరికొండ శ్రీనివాసాచారి



మాట్లాడుతున్న డాక్టర్ శ్రీనివాసాచారి

పరకాల : యువత, విద్యార్థులు ఆన్‌లైన్ గేమ్స్‌తో పాటు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఎస్వీ విద్యా సంస్థల అధినేత, ప్రముఖ విద్యావేత్త డాక్టర్ సిరికొండ శ్రీనివాసాచారి సూచించారు. వరంగల్ పోలీసు కమిషనర్ సన్‌ప్రీత్‌సింగ్ ఆదేశాల మేరకు పరకాల పోలీసులు ఎస్వీ కళాశాల ఆవరణలో ఆన్‌లైన్ గేమ్స్, గంజాయి, ఇతర మత్తు పదార్థాలతో వచ్చే అనర్థాలపై శుక్రవారం జాగృతి బృందం ద్వారా అవగాహన కల్పించి విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం శ్రీనివాసాచారి మాట్లాడుతూ.. విద్యార్థులు వ్యసనాలకు దూరంగా ఉండి భవిష్యత్‌కు బంగారు బాటలు వేసుకోవాలని అన్నారు. ముఖ్యంగా ఆన్‌లైన్ గేమ్స్, చెడు స్నేహానికి దూరంగా ఉండాలన్నారు. పరకాల ఎస్సై పవన్, కళా బృందం ఇన్‌చార్జ్ ఏఎస్సై నాగమణి, కళాశాల అధ్యాపక బృందం, పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

'బాధిత రైతు కుటుంబాలను ఆదుకుంటాం'

హన్మకొండ: ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలను ఆదుకుంటామని సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ కార్యదర్శి పల్లెపాడు దామోదర్ అన్నారు. హనుమకొండ రాంనగర్‌లో సర్వోదయ సంస్థ ఆధ్వర్యంలో వడ్డీలేని రుణాల పంపిణీ కార్యక్రమం శుక్రవారం జరిగింది. ఆత్మకూరు, గీసుకొండ మండలాల్లోని 70 మంది మహిళలకు రూ.25 వేల చొప్పున వడ్డీ లేని రుణాలను చెక్కుల రూపంలో అందించారు. ఈ సందర్భంగా దామోదర్ మాట్లాడుతూ ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలకు 25 ఏళ్లుగా సంస్థ తరపున ఆర్థిక సాయం చేస్తూ వడ్డీ లేని రుణాలను అందజేసి అండగా నిలుస్తున్నట్లు చెప్పారు. వ్యవసాయ రంగంలో పెట్టుబడులు పెరగడం, గిట్టుబాటు ధర రాకపోవడం, సరైన మార్కెటింగ్ సౌకర్యాలు లేకపోవడం, సకాలంలో వర్షాలు కురవకపోవడంతో రైతులు ఇబ్బందులు ఎదురుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. బ్యాంకుల నుంచి రుణాలు అందకపోవడంతో ప్రైవేటు వ్యక్తుల దగ్గర అధిక వడ్డీకి అప్పు చేసి తిరిగి చెల్లించలేక ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలకు చెందిన 3,700 మంది మహిళలకు సర్వోదయ సంస్థ రుణాలను ఇచ్చి ఆదుకుందని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో సర్వోదయ సంస్థ ప్రతినిధులు కవిరాజ్, ఇందిర, రవీందర్ సతీష్, జ్యోత్స్న, మంజుల, రాజుతో పాటు స్థానికులు, తదితరులు పాల్గొన్నారు.

రైతులను మోసగిస్తున్న కాంగ్రెస్ సర్కారు

- మాజీ ఎమ్మెల్యేలు మార్తినేని, కొండేటి, తక్కళ్లపెల్లి ధ్వజం



వినతిపత్రం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యేలు

ఐనవోలు : సాధ్యం కాని హామీలు గుప్పించి గద్దెనెక్కిన కాంగ్రెస్ పార్టీ రైతులను సైతం మోసగిస్తుందని మాజీ ఎమ్మెల్యేలు మార్తినేని ధర్మారావు, కొండేటి శ్రీధర్, తక్కళ్లపెల్లి రాజేశ్వర్‌రావు, బీజేపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ చైర్మన్ ధర్మారావు ధ్వజమెత్తారు. శుక్రవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆ పార్టీ మండల అధ్యక్షుడు ప్రణయ్ ఆధ్వర్యంలో రైతుల సమస్యలను పరిష్కరించాలని నిరసన చేపట్టగా వారు పాల్గొని మాట్లాడారు. మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ హామీలను విస్మరించిందన్నారు. భూ భారతితో రైతుల సమస్యలు ఆగస్టు 15 వరకు పరిష్కరిస్తామని చెప్పి మండల వ్యాప్తంగా 3,800 దరఖాస్తులు స్వీకరించిందని గుర్తుచేశారు. ఇప్పటి వరకు పరిష్కరించలేదని ఆరోపించారు. నాలుగు నెలలు గడుస్తున్నా యాసంగి సన్నాలకు బోనస్‌లు చెల్లించలేదని అన్నారు. పెట్టుబడి సాయం ఎకరాకు రూ.15 వేలు ఇస్తామని చెప్పి మోసం చేసిందన్నారు. రైతులకు యూరియా అందించకుండా కేంద్రంపై విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ధర్మసాగర్ రిజర్వాయర్ నుంచి నీటిని విడుదల చేసి చెరువులు నింపాలని డిమాండ్ చేశారు. అనంతరం ప్రభుత్వం రైతుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ తహసీల్దార్ విక్రమ్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కన్వీనర్ కేశవరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుపతిరెడ్డి, మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ శ్రీరాములు, నాయకులు రాజు, రవితేజ, భూపాల్‌రావు, జైపాల్, తిరుపతి, భాస్కర్, లలిత, రాజేష్, ఆనందం, రాజారెడ్డి ఉన్నారు.

పంచాయతీ అధికారులపై లోకాయుక్తలో ఫిర్యాదు

ఆత్మకూరు : గ్రామపంచాయతీ నిధులను దుర్వినియోగం చేశారని ఆరోపిస్తూ మండలంలోని గుడెప్పాడ్ గ్రామ పంచాయతీ కార్యదర్శి క్రాంతికుమార్, ఎంపీఓ విమల, డీఎల్‌పీఓ రవిబాబు, డీపీఓ లక్ష్మీరమాకాంత్, జిల్లా ఆడిట్ అధికారులపై లోకాయుక్తలో ఫిర్యాదు చేసినట్లు గుడెప్పాడ్ మాజీ ఎంపీటీసీ బీరం రజనీకర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో లోకాయుక్తను ఆశ్రయించానని పేర్కొన్నారు.

ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



ఆత్మకూరు : అంగన్‌వాడీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి



శాయంపేట : మొక్క నాటుతున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



ఎల్కతుర్తి : ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ విద్యాలత

- ఎమ్మెల్యేలు, రేవూరి, గండ్ర.

దామెర / నడికూడ / ఆత్మకూరు/ : ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. పనుల జాతర–2025 కార్యక్రమంలో భాగంగా మండలంలోని పసరగొండలో అంగన్‌వాడీ కేంద్రం, ఊరుగొండలో గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి శంకుస్థాన చేశారు. అదే విధంగా పసరగొండలో రూ.10 లక్షల ఈజీఎస్ నిధులతో చేపట్టిన మట్టి రోడ్డును, రూ.3 లక్షలతో నిర్మించిన కోళ్ల ఫామ్‌ను ప్రారంభించారు. అదే విధంగా నడికూడ మండలంలోని కంఠాత్మకూరు గ్రామంలో పల్లె దవాఖానా ప్రారంభించిన అనంతరం పనుల జాతర –2025లో భాగంగా నూతన అంగన్‌వాడీ భవనానికి శంకుస్థాపన, జెడ్పీహెచ్‌ఎస్‌లో సైన్స్ ల్యాబ్ నిర్మాణానికి భూమిపూజ, తదితర పనులను ప్రారంభించారు. దామెర మండలంలోని ఊరుగొండ గ్రామపంచాయతీ భవనానికి శంకుస్థానచేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఆత్మకూరు మండల కేంద్రంలో ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్‌మెంట్ యూనిట్‌తో పాటు చౌళ్లపల్లి, అగ్రంపహాడ్ గ్రామాల్లో అంగన్‌వాడీ భవన నిర్మాణాలకు శంకుస్థాపన చేసి మాట్లాడారు.

శాయంపేట : గ్రామాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిబాపూలే బాలుర గురుకుల పాఠశాలలో రూ.20 లక్షల నిధులతో నిర్మించిన సీసీ రోడ్డును శుక్రవారం ఆయన ప్రారంభించారు. అనంతరం వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థి జగన్ తయారు చేసిన హ్యాండ్‌క్రాఫ్ట్‌ను ఎమ్మెల్యే అందించగా ఆయన అభినందించారు. అనంతరం మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో స్వచ్ఛ భారత్ మిషన్ నిధులు రూ. 3 లక్షలతో కమ్యూనిటీ టాయిలెట్స్‌కు శంకుస్థాపన చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి పాలనలో ప్రతీ గ్రామం అభివృద్ధిలో దూసుకెళ్తుందన్నారు. గత ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాలకు నిధులు కేటాయించకుండా వివక్ష చూపించడంతో పల్లెలు అభివృద్ధికి వెనుకబడ్డాయని అన్నారు. ప్రజలు ఆవరణలో మొక్కలు నాటి కాలుష్యాన్ని నివారించాలని ఆయన పిలుపునిచారు. హనుమకొండ డీఆర్డీఓ మేన శ్రీను, పరకాల ఆర్డీఓ నారాయణ, తహసీల్దార్ సత్యనారాయణ, ఎంపీడీఓ ఫణిచంద్ర, ఏఓ గంగాజమున. ఏపీఓ అనిత, ఎంజేపీ ప్రిన్సిపాల్ రేవతి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎల్కతుర్తిలో పనుల జాతరలో జెడ్పీసీఈఓ

ఎల్కతుర్తి : మండల కేంద్రంలో శుక్రవారం జెడ్పీ సీఈఓ విద్యాలత సందర్శించారు. పనుల జాతర కార్యక్రమంలో భాగంగా మండలంలో 16 పనులను ప్రారంభించారు. మండల కేంద్రానికి చెందిన సిరిసిల్ల రాజు అనే రైతు ఇంటి వద్ద అజోళ్ల పెంపకం కోసం సంపుల నిర్మాణానికి ఆమె ముగ్గుపోసి పనులు ప్రారంభించారు. మండల స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాసులు, ఎంపీడీఓ విజయ్‌కుమార్, ఎంపీఓ అనిత, కార్యదర్శి శ్రీనివాస్ పాల్గొన్నారు.

కమలాపూర్ : ప్రతీ ఇంటి ఆవరణలో గుంత నిర్మించుకోవాలని జిల్లా బీసీ సంక్షేమాధికారి, మండల ప్రత్యేకాధికారి లక్ష్మణ్, ఎంపీడీఓ బాబు సూచించారు. మండలంలోని గూనిపర్తి, అంబాల, శ్రీరాములపల్లి, శనిగరం గ్రామాల్లో శుక్రవారం నిర్వహించిన పనుల జాతర కార్యక్రమాల్లో వేర్వేరుగా పాల్గొని ఉపాధి హామీ పథకం ద్వారా నిర్మించుకున్న పశువుల పాకలు, నాడెప్ కంపోస్ట్ పిట్, హజోలా నిర్మాణాలను ప్రారంభించారు. రూ.90 వేలతో డ్రెయినేజీ చివర నిర్మించనున్న ఇంకుడు గుంతకు, పశువుల పాకకు భూమి పూజ చేశారు. అనంతరం ఉపాధి హామీ పథకంలో టేకు ప్లాంటేషన్ ఏర్పాటు చేసుకుని ఆ కలపాను ఇందిరమ్మ ఇంటికి వినియోగించుకున్న తుమ్మనపల్లి రమేష్–రజిత దంపతులు, పంచాయతీ కార్యదర్శి ప్రవళిక, మల్టీ పర్పస్ వర్కర్లు, ఎక్కువ రోజుల ఉపాధి హామీ పథకం పనులు చేసిన కూలీలు, ప్లాంటేషన్ వాచర్స్, పారిశుద్ధ్య కార్మికులను సన్మానించారు. ఎంపీఓ చేతన్‌కుమార్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు శ్రీనివాస్, శకుంతల, ప్రవళిక, గ్రామ ప్రత్యేకాధికారి మధు, ఈసీ కార్తీక్, టీఏ మానస పాల్గొన్నారు.

పత్తిసాగులో సస్యరక్షణ చర్యలు పాటించాలి



పత్తిపంటను పరిశీలిస్తున్న ఏఈఓ రామకృష్ణ

దామెర : పత్తిసాగులో సస్యరక్షణ చర్యలు పాటించాలని ఏఈఓ రామకృష్ణ సూచించారు. కోగిల్వాయిలో శుక్రవారం పత్తిపంటలను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. ప్రస్తుతం పత్తిచేనులో రసం పీల్చు పరుగు ఉధృతిని గమనించినట్లు చెప్పారు. పచ్చ దోమ నివారణకు ఎకరానికి మోనోక్రోటోఫాస్, మోనోఫాస్ 400 మిల్లీ లీటర్లు లేదా దయోమిధాక్జామ్ 25 శాతం చకోర 100 గ్రాములు, వేప నూనే పిచికారీ చేయాలని సూచించారు. తెల్లదోమ నివారణకు అసిటామిప్రిడ్, ఫెలిక్స్ 100 గ్రాములు లేదా ప్రొఫెనోఫాస్ 50 శాతం, హెక్జానోవ 400 మిల్లీ లీటర్లు, ట్రజోఫాస్ 400 మిల్లీ లీటర్లు, 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. రైతులు రాజిరెడ్డి, శ్రీనివాస్, కొమురుమల్లు, యాకాంబ్రమ్ పాల్గొన్నారు.

నట్టల నివారణ మందు పంపిణీ చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న గొర్రెల కాపర్లు

వేలేరు : మూగ జీవాలకు రాష్ట్ర ప్రభుత్వం నట్టల నివారణ మందు పంపిణీ చేయాలని గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం మండల అధ్యక్షుడు సంపత్ కుమార్ డిమాండ్ చేశారు. గొర్లకాపర్లకు ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని శుక్రవారం తహసీల్దార్ హెచ్.కోమికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఓట్లపై పెట్టిన దృష్టి హామీలు నెరవేర్చడంపై పెట్టడం లేదని విమర్శించారు. మండలంలోని ప్రభుత్వ భూములను గుర్తించి గొర్రెలు, మేకల మేత కోసం గొర్రెలకాపర్ల సొసైటీలకు అప్పగించాలని డిమాండ్ చేశారు. జీఎంపీఎస్ నాయకులు అనిల్, సంపత్, శ్రీనివాస్ పాల్గొన్నారు

రాష్ట్ర ప్రభుత్వానికి గుణపాఠం తప్పదు



దామెర : మాట్లాడుతున్న రాము

దామెర : రైతు వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికి ప్రజల చేతిలో గుణపాఠం తప్పదని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు గండు రాము విమర్శించారు. ముస్త్యాలపల్లి, తక్కళ్లపహాడ్‌లో శుక్రవారం ముఖ్య కార్యకర్త సమావేశం నిర్వహించి మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థులను గెలిపించే విధంగా ప్రతీ కార్యకర్త పనిచేయాలని సూచించారు. యూరియా కోసం రైతుల ఇబ్బందులు పడుతుంటే రాష్ట్ర ప్రభుత్వం మొద్దు నిద్ర వీడడం లేదని విమర్శించారు. గ్రామ పార్టీ అధ్యక్షులు రమేశ్, రాజు, మండల నాయకులు జాకిర్‌అలీ, కృపాకర్‌రెడ్డి, శంకర్, మల్లయ్య, కమలాకర్, శంకర్, భిక్షపతి పాల్గొన్నారు.

ఆత్మకూరులో..

ఆత్మకూరు : రానున్న స్థానిక ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థుల విజయం ఖాయమని ఆ పార్టీ మండల అధ్యక్షుడు లేతాకుల సంజీవరెడ్డి అన్నారు. చౌళ్లపల్లిలో శుక్రవారం కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పాలనతో ప్రజలు విసిగిపోయారని అన్నారు. నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే ధర్మారెడ్డి చేసిన అభివృద్ధే కనిపిస్తుందని, కొత్తగా కాంగ్రెస్ చేసిన అభివృద్ధి ఏమి లేదన్నారు.

చిరంజీవి జన్మదిన వేడుకలు

పరకాల / కమలాపూర్ : సినీ నటుడు చిరంజీవి జన్మదిన వేడుకలను పరకాల పట్టణంలో శుక్రవారం చిరంజీవి అభిమానుల సంఘం నియోజకవర్గ ఇన్‌చార్జ్ బొచ్చు భాస్కర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కేక్ కట్‌చేసి స్వీట్లు పంపిణీ చేశారు. అభిమానులు రవికుమార్, శంకర్, రాఘవ, రవి, రమణతో పాటు తదితరులు పాల్గొన్నారు.

కమలాపూర్‌లో..

కమలాపూర్ : మండల కేంద్రంలో అంజనీపుత్ర ఫ్యాన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు స్వీట్లు, నోటుబుక్కులు, పెన్నులు పంపిణీ చేశారు. మండల అధ్యక్షుడు నారాయణగౌడ్, నాయకులు శివకుమార్, తిరుపతితో పాటు తదితరులు ఉన్నారు.

లక్కాకులమ్మకు పూజలు



అమ్మవారిని దర్శించుకునేందుకు క్యూలో నిలుచున్న భక్తులు

ఎల్కతుర్తి : భీమదేవరపల్లి మండలం గట్లనర్సింగాపూర్‌లో గల రాతి సొరంగంలో వెలసిన లక్కాకులమ్మ అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు శుక్రవారం పోటెత్తారు. శ్రావణమాసంలో మూడు రోజుల పాటు జాతర నిర్వహించడం అనవాయితీగా వస్తోంది. అమ్మవారి ఆలయ ప్రాంగణంలో గోషేబాబా దర్గా ఉండడంతో ముస్లింలు ప్రార్థనలు చేయగా భక్తులు సైతం అమ్మవారిని దర్శించుకున్న అనంతరం ఈ దర్గాను దర్శించుకుంటారు.

ఘనంగా పోచమ్మ బోనాలు



బోనాలతో ఊరేగింపుగా ఆలయానికి వెళ్తున్న మహిళలు

ఎల్కతుర్తి : మండల కేంద్రంలో యాదవ సంఘం ఆధ్వర్యంలో శ్రావణమాస చివరి శుక్రవారం సందర్భంగా పోచమ్మ బోనాల వేడుకలను ఘనంగా నిర్వహించారు. డప్పుచప్పుళ్ల నడుమ బోనాలతో ఊరేగింపుగా బయలుదేరిన మహిళలు.. అమ్మవారి ఆలయానికి చేరుకున్నారు. ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.